RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | గురువారం | 07 -03 - 2024
సంపుటి: 1 | సంచిక : 288 | పేజీలు : 4 | వెల : 5/-

## జెట్ స్పీడ్‌లో వైసీపీ...



2లో

# ఇయ్యాల్లో.. రేపో..!

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఖరారు
- నేడు ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ భేటీ
- మీటింగ్‌కు హాజరుకానున్న రేవంత్
- తొలి జాబితా ప్రకటించే అవకాశం
- 28 తుదిదశకు కాంగ్రెస్ జాబితా

హైదరాబాద్, ప్రభాసూర్యుడు : తెలంగాణలో 17కి 17 సీట్లు గెలుస్తామని ఢంకా బజాయిస్తున్న కాంగ్రెస్, గెలుపు గుర్రాలను రంగంలోకి దించే కసరత్తును చివరిదశను తీసుకొచ్చింది. చాలా సెగ్మెంట్లలో ఇప్పటికే అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. నేడు ఢిల్లీలో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీ భేటీ అవుతోంది. తొలిజాబితాలో తెలంగాణ సీట్లను కాంగ్రెస్ ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణపై కాంగ్రెస్ ఫోకస్ చేస్తోంది. మహబూబ్‌నగర్ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరును ఇప్పటికే రేవంత్ ప్రకటించారు. మిగతా సీట్లపై మాత్రం హైకమాండ్ ప్రకటన చేస్తుందని చెబుతున్నారు. ఒకవైపు తెలంగాణ నుంచి బరిలోకి దిగాల్సిందిగా రాహుల్‌గాంధీని కాంగ్రెస్ నేతలు కోరారు. కేరళలోని వాయనాడ్‌లో అఖిఎ ఈసారి కూడా తమ అభ్యర్థిని బరిలోకి దించడంతో, తెలంగాణ నుంచి ఆయన్ను బరిలోకి దించడానికి కాంగ్రెస్ నేతలు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో 17 సీట్ల టార్గెట్‌ను చేరుకోవాలంటే పార్టీకి మరింత జోష్ కావాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇందుకోసమే రాహుల్‌గాంధీని పోటీకి దించేలా లాబీయింగ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎంపీ అభ్యర్థిగా చల్లా వంశీచంద్ రెడ్డిని ప్రకటించిన సీఎం

మహబూబ్‌నగర్ సీటుకు కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పేరును ఇప్పటికే రేవంత్ ప్రకటించారు. మిగతా సీట్లపై మాత్రం హైకమాండ్ ప్రకటన చేస్తుందని చెబుతున్నారు.



మిగతా 2వ పేజీలో...

# బలం.. బలగం.. ఉన్నోళ్ల కోసం!

## బలమైన అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ అన్వేషణ

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. తెలంగాణలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. బీఆర్ఎస్‌లో కింది స్థాయి నేతల నుంచి ఎంపీ టిక్కెట్ పొందగలిగే స్థాయి నేతల వరకూ రాత్రికి రాత్రే జంప్ చేస్తున్నారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీలో అన్ని పదవులు అనుభవించిన సీనియర్ నేతల్లో చాలామంది ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిపోగా, కాంగ్రెస్‌లో టికెట్ రాదనుకున్న మరికొందరు బీజేపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల కసరత్తును దాదాపుగా పూర్తి చేశాయి. కానీ బీఆర్ఎస్ మాత్రం.. ఒక వేళ టిక్కెట్ ఇస్తే ఉంటారా .. వెళ్లిపోతారా అన్న సందిగ్ధంలో పడింది. ప్రస్తుతం తెలంగాణలోని రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్ పార్టీని కలవర పెడుతున్నాయి. నిన్నటి దాకా తన దర్శనం కోసం పడిగాపులు కాసిన నేతలంతా ఇప్పుడు వేరే పార్టీలో చేరిపోవటం, గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా దిక్కులు చూడటంతో కేసీఆర్ దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయారు. మరీ ముఖ్యంగా గత ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని దాదాపు అన్ని సీట్లు గెలుచుకుని ఆధిక్యాన్ని ప్రదర్శించిన ఆ పార్టీకి నేడు లోక్‌సభ అభ్యర్థులు కరువయ్యా రు. అధికా రంలో ఉ ండగా అన్నీ తానై వ్యవహ రించిన కుమారుడు కేటీఆర్.. విపక్షంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పార్టీని కాపాడుకోలేకపోవటం, హరీష్ రావు సైతం కేవలం తన జిల్లా రాజకీయాలకే పరిమితం కావటంతో కేసీఆర్ మళ్లీ రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది. లోక్‌సభ సీట్ల విషయానికొస్తే.. ఎంపీగా పోటీచేయాలంటే వంద కోట్లైనా ఖర్చు పెట్టక తప్పని పరిస్థితి ఉంది. దీంతో దీనికోసం పోటీపడే వ్యాపారవేత్తలు, సంపన్నులు తమ ప్రయోజనాలు నెరవేరాలని కోరుకోవటం




3లో

మిగతా 2వ పేజీలో...



4లో

## ఇందిరమ్మ ఇళ్లకు నిధులు


కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా నిధులను కూడా కేటాయించింది.




4లో

## గ్రూప్ పరీక్షల తేదీలు ఖరారు!

గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన తేదీలను టీఎస్‌పీఎస్సీ ఖరారు చేసింది.



4లో

## ఏప్రిల్ 8న సూర్యగ్రహణం



## దేశంలో తొలి మెట్రోవాటర్ ప్రాజెక్టు

ప్రధాని మోదీ దేశంలోనే తొలి అండర్ వాటర్ మెట్రో సర్వీస్‌లను ప్రారం భించారు. కోల్‌కత్తా మెట్రో ఈస్ట్‌వెస్ట్ కారిడార్‌లో భాగంగా దీన్ని నిర్మిం చారు.

2లో

# కరువును ఎదుర్కొందాం

- ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది
- ఆన్‌లైన్లో 'రైతు నేస్తం' ప్రారంభించిన సీఎం రేవంత్

హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు : కరువు వచ్చినా.. ఎంత కష్టం వచ్చినా రైతులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరువు పరిస్థితులున్నాయని, కలిసికట్టుగా కరువును ఎదుర్కొందామని సీఎం పిలుపునిచ్చారు. ఏడాదిగా సరైన వర్షపాతం లేకపోవటంతో రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటుతున్నాయని , అందుకే అన్ని ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రిజర్వాయర్ల నుంచి నీళ్లను విడుదల చేయాలని కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతంలోని రైతులు, నాయకులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. రైతులందరూ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎండాకాలంలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాల్సిన అవసరముందని, అందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని సీఎం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన రైతు నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి బుధవారం ఉదయం తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ సెక్రెటరీ, కమిషనర్ రఘునందనరావు, డైరెక్టర్ గోపి, రైతు సంఘాల ప్రతినిదులు సుంకెట అన్వేష్ రెడ్డి, నల్లమాల వెంకటేశ్వరరావు, వై వెంకటేశ్వరరావు సచివాలయం నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి పలువురు రైతులు కాన్ఫరెన్స్ లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. తాము పండిస్తున్న పంటల ద్వారా లాభాలు సాధిస్తున్న తీరును వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2601 రైతు వేదికలకు



మిగతా 2వ పేజీలో...

# నంద్యాలలో ఘోర ప్రమాదం

నంద్యాల, ప్రభాతసూర్యుడు : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం నల్లగుంట్ల వద్ద ఆగి ఉన్న లారీని ఒక కారు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. వీరంతా తిరుపతి శ్రీవారి దర్శనానికి వెళ్లి వస్తుండగా



మిగతా 3వ పేజీలో...

# నడుస్తున్న కారులో మంటలు


హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : హైదరాబాద్‌లోని సైఫాబాద్ రోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం నడుస్తున్న కారులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ కారు దిగి ప్రాణాలు కాపాడుకున్నాడు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ షాకింగ్ సంఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. కారు లక్డీకాపూల్ నుంచి ఖైరతాబాద్ వైపు వెళ్తుండగా అందులో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ కారును రోడ్డు పక్కన ఆపుజేశాడు. దీంతో అందులో



మిగతా 3వ పేజీలో...

# కాంగ్రెస్‌కు రేవంత్ మోసం

హైదరాబాద్, ప్రభాతసూర్యుడు : 100 రోజుల పాలన చూసి ఓటు వేయమని రేవంత్ రెడ్డి అంటున్నారని.. అసలు వంద రోజుల్లో ఆయనేం చేశారని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ప్రశ్నించారు. వైట్ పేపర్.. ఆ ఆపేర్ అంటూ కాషాయ పేపర్ మీద ఆయన లవ్ లెటర్ రాశాడని.. వాస్తవానికి ప్రజలనే కాదు కాంగ్రెస్ పార్టీని కూడా మోసం చేశారని విమర్శించారు. ఆదాని, గుజరాత్ మెడల్ ఫైల్ అని మళ్ళీ ఆయనే గుజరాత్ మోడల్ కావాలని రేవంత్ అన్నాడని..10 రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుంది.. అలాంటప్పుడు మోడీని ఎందుకు అంత పొగడటమని ప్రశ్నించారు. అంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని చెప్పకనే చెప్పారన్నారు. 3 నెలల పాలనలో ప్రజలను,ఇటు కాంగ్రెస్ పార్టీ ని మోసం చేస్తున్నాడు... 100 రోజుల పాలన చూసి ఓటు వేయండి అన్నాడు మీరు మరి ఇప్పుడు ఎం చేశారని మీకు ఓటు వేయాలని ప్రశ్నించారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని చెప్పారు కానీ



మిగతా 2వ పేజీలో...

# ఎన్ని ఇబ్బందులైనా నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం

- విలువ ఆధారిత పరిశ్రమగా ముందుకు తీసుకెళ్తాం
- బీఆర్ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను నిర్లక్ష్యం చేసింది
- జగిత్యాలలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

జగిత్యాల- ప్రభాతసూర్యుడు : ఎన్ని ఇబ్బందులు, అడ్డంకులు ఎదురైన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాన అంశంగా పేర్కొన్న నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి తీరుతామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాషాలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. చెరుకు



మిగతా 3వ పేజీలో...

# నారాయణఖేడ్‌లో అగ్ని ప్రమాదం

మెదక్, ప్రభాతసూర్యుడు : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ కారు మెకానిక్ షెడ్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో మూడు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలంలో దట్టమైన పొగలు అలుముకోగా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి



మిగతా 3వ పేజీలో...

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# బొల్లారంలో డైట్ కాలేజీ

**ప్రారంభించిన మంత్రి పొన్నం**

**సికింద్రాబాద్ - ప్రభాతసూర్యుడు :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ బొల్లారంలో డైట్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ ను బీసీ వెల్ఫేర్ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డీఈవో , ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డైట్ కాలేజీ అకాడమిక్ బ్లాక్ 4 కోట్ల రూపాయల తో నిర్మించుకున్నం. దేశ పౌరులను ,విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల కేంద్రం ఇది. ఇది టీచర్ల శిక్షణ నిర్వహణ కేంద్రం. డైట్ కాలేజీ లో బీఈడీ శిక్షణ కూడా ఇచ్చే విధంగా ముందుకు పోతాం. డైట్ కాలేజీ వేరే ప్రాంతం నుండి ఇక్కడి రావడం వల్ల నేషనల్ కౌన్సిల్ లో రికగ్నేషన్ కోల్పోయిందని అన్నారు. కాలేజీ రికగ్నేషన్ కోల్పోవడం పై కాలేజీ ప్రిన్సిపల్ పై మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేసారు . రికగ్నేషన్ కోల్పోవడం పై తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదు ప్రశ్నించారు. వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ముందుకు వెళ్తామని అన్నారు.

# జెట్ స్పీడ్‌లో వైసీపీ...



**విజయవాడ, ప్రభాతసూర్యుడు :** ఏపిలో ఎన్నికల కోసం వైసీపీ మరో క్యాంపెయిన్ ప్రారంభించింది. అన్ని వర్గాలకు దగ్గరయ్యేలా భారీగా ప్రచారాన్ని ముమ్మరం చేసింది వైసీపీ. అందులో భాగంగానే సిద్ధం సభలకు ధీటుగా ఏపి వ్యాప్తంగా నా కల పేరుతో జగన్ ఫోటోలతో భారీగా ప్రచారాన్ని విస్తృతం చేయబోతుంది. అధికార వైసీపీ రాష్ట్రంలో ఇప్పటివరకు సిద్ధం క్యాడర్ సమావేశాల పేరుతో ఎన్నికల హీట్ పుట్టించింది. ఉత్తరాంధ్రలో భీమిలి ఏలూరు, అనంతపురం వేదికగా జరిగిన సభలకు లక్షలాదిగా కార్యకర్తలు హాజరైయ్యారని వైసీపీ అంటోంది.అయితే సిద్ధం సభల సిరీస్లో చివరిగా జరగనున్న పల్నాడు జిల్లా సభకు 15 లక్షల మంది కార్యకర్తలు వస్తారని వైసీపీ అంచనా వేస్తోంది .ఓ వైపు సిద్ధం సభలు నిర్వహిస్తూనే ఎన్నికల పోల్ మేనేజ్మెంట్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా బూత్ కమిటీలను నియమించి మరో సరి కొత్త నినాదంతో వైసీపీ ఎన్నికల రణరంగంలోకి దిగుతోంది. నాకు ఒక కల ఉంది" పేరుతో కొత్త నినాదాన్ని వైసీపీ సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు జగన్ ఫోటోతో సిద్ధం ఫ్లెక్సీలు చూశాం, దానికి సమాధానం చెబుతు సీఎం జగన్ కార్యకర్తల కోసం సిద్ధం సభలు నిర్వహించారు .వచ్చే ఆదివారం అద్దంకిలో జరగనున్న సిద్ధం సభ చివరిది కావడంతో ఇకపై ఎపిలో సిద్ధం పోస్టర్లు కనిపించవు. అందుకు ప్రత్యామ్నాయంగా వైసీపీ మరో నినాదంలో ప్రజల్లోకి వస్తోంది. నాకు ఒక కల ఉంది పేరుతో రాష్ట్రంలోని ప్రతి నగరం ప్రతి వాడలో కార్మికులతో, పిల్లలతో, అవ్వతాతలతో, అక్కచెల్లమ్మలతో, రైతులతో జగన్ ఉన్న ఫోటోతో మీ కల నా కల అంటూ ప్రత్యక్షం అయ్యాయి. దీంతో ప్రజల కలే తన కలగా చెబుతూ అవి నేరవేర్చే దిశగా అడుగులు వేస్తానంటూ సీఎం జగన్ తన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ మొత్తం మీ కల నా కల ప్రచారంలో మొత్తం 6 వర్గాల ప్రజలకు చెందిన హోర్డింగ్ లు ఉన్నాయి. వైసీపీ ఏర్పాటు చేసిన హోర్డింగ్లలో రైతుల కల ? జగనన్న కల, యువత కల జగనన్న కల, అక్కా చెల్లెమ్మల కల జగనన్న కల, అవ్వా తాతల కల జగనన్న, కార్మికుల కల జగనన్న కల అంటూ హోర్డింగ్లను వైసీపీ ఏర్పాటు చేసింది.వైసీపీ తాజా స్లోగన్ భారీ అర్థం ఉందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది ఎన్నికల కోసం పార్టీలు ఇచ్చే హామీలు కేవలం మ్యానిఫెస్టోలో మాత్రమే చూస్తుంటాం కానీ అందుకు భిన్నంగా ఆలోచించిన వైసీపీ ప్రజల్లోకి ముఖ్యంగా ఆయా వర్గాల దగ్గరయ్యే నినాదాలతో ప్రజల్లోకి వెళ్తుంది. సిద్ధం పేరుతో నిర్వహించిన సభలు భారీ హిట్ అవడంతో అదే ఊపుతో ఇప్పుడు బూత్ లెవల్లో ఉండే ప్రతి ఒక్కరికీ తాము వస్తె ఏమి చేస్తాము ఏమి ఇస్తాము అనే అంశాలను ఆయా వర్గాల అభివృద్ధికి దోహద పడేలా భారీగా క్యాంపెయిన్ చేస్తుంది వైసీపీ. ముఖ్య యువత, రైతులు, వృద్ధులు, కార్మి కుల కోసమే వైసీపీ అండగా ఉంటుందన్న అర్థం వచ్చేలా క్యాంపెయిన్ చేస్తుంది. ఇప్పుడు జెట్ స్పీడ్ ఎన్నికల కథన రంగంలో దూసుకెళ్తున్న వైసీపీ కొత్త నినాదంతో సరికొత్తగా అడుగులు వేస్తుంది.

# నదిలో రైలు ప్రయాణం!




- **కోల్‌కతాలో ప్రారంభం**
- **జెండా ఊపిన పీఎం మోదీ**
- **దేశంలో తొలి మెట్రోవాటర్ ప్రాజెక్టు**

**పశ్చిమబెంగాల్, ప్రభాతసూర్యుడు :** ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోనే తొలి అండర్ వాటర్ మెట్రో సర్వీస్‌లను ప్రారంభించారు. కోల్‌కత్తా మెట్రో ఈస్ట్ – వెస్ట్ కారిడార్‌లో భాగంగా దీన్ని నిర్మించారు. మొత్తం 4.8 కిలోమీటర్ల మేర ఈ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం కేంద్రం రూ.4.965 కోట్లు ఖర్చు చేసింది. గ్రౌండ్ లెవెల్‌కి 30 మీటర్ల లోతులో ఈ కారిడార్‌ని నిర్మించారు. ఈ రైలుని ప్రారంభించిన తరవాత ప్రధాని మోదీ అందులో ప్రయాణించారు. ఆయనతో పాటు కొంత మంది విద్యార్థులూ ఉన్నారు. కాసేపు వాళ్లతో ముచ్చటించారు. హుగ్లీ నది కింద నిర్మించిన ఈ కారిడార్‌లో మెట్రో ట్రైన్ హౌరా నుంచి సాల్ట్ లేక్ వరకూ అనుసంధానించనుంది. వెస్ట్‌బెంగాల్‌లో ఈ రెండూ కీలకమైన నగరాలే. ఓ మెట్రోలో ప్రయాణిస్తూ మరో మెట్రోలోని ప్రయాణికులకు అభివాదం చేశారు ప్రధాని మోదీ. మోదీతో పాటు పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందర్, ప్రతిపక్ష నేత సువేందు అధికారి, పలువురు మెట్రో అధికారులు రైల్‌లో ఉన్నారు. రేపటి నుంచి (మార్చి 7) ఈ సర్వీస్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నట్టు రైల్వే అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కోల్‌కత్తాలో ఓ కీలక ప్రాజెక్ట్‌ని గతేడాదే ప్రారంభించారు ప్రధాని మోదీ. గతేడాది ఏప్రిల్‌లో అండర్ వాటర్ టన్నెల్‌లో ట్రైన్ సర్వీస్‌లను ప్రారంభించారు. ఇది కూడా భారత్‌లో తొలిసారి. ఇవి ప్రధాని మోదీ కోల్‌కత్తా ప్రజలకు ఇచ్చిన కానుకలు అంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. ఎన్నో ఏళ్ల నుంచి కలగా ఉండిపోయిన ఈ ప్రాజెక్ట్‌ని సాకారం చేసుకున్నామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రధాని మోదీ రూ.15,400 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశారు. హుగ్లీ నదిలో నిర్మించిన టన్నల్‌లో మెట్రో రైలు సేవలను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు.

# కాంగ్రెస్‌కు రేవంత్ మోసం

**మొదటిపేజీ తరువాయి..**



ఇప్పుడు ఏమైంది.ఇప్పటివరకు కూడా రుణమాఫీ లేదు. కనీసం మొన్న బడ్జెట్ లో కూడా రైతు రుణమాఫీ కి నిధులు కేటాయింపులు లేవు. రైతులకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పారు. పంట కొనుగోలు లో కూడా ఇలానే చెప్పారు. ఎందుకు ఇవ్వలేదు బోనస్ అని ప్రశఅనించారు. ఇప్పుడైనా వచ్చే యాసంగి పంటకు క్వీన్టల్ కు 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎందుకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి.
కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కరువు వచ్చింది.కొత్త కొత్త బోరు బండ్లు వచ్చాయి.ట్యాంకర్ల ద్వారా వరి పంటకు నీళ్లు పోస్తున్నారన్నారు. అవ్వ పెన్షన్ ఎంత వస్తుంది అన్నారు మేము వస్తే 4 వేలు ఇస్తాం అన్నారు..ఏమైంది కనీసం ఉన్న రెండు వేలు కూడా నేల నెల పడడం లేదు. ఒక్క నెల ఎగ్గొట్టారని విమర్శించారు. బండ్ పేపర్ రాసిచ్చినారు..బండ్ పేపర్ రాసి ఇచ్చిన వారిపై కేస్ పెట్టాలని డిమాండ్ చేశారు. 6 గ్యారెంటీలల్లో 13 హామీలు ఉన్నాయి అవన్నీ అమలు చేయాలి అప్పుడే ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మహిళలను మహా లక్ష్మీ లను చేస్తాం అన్నారు ఏమైందని మహిళలు ఆలోచించాలన్నారు. ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా ఇస్తాం అన్నారు ఏమైంది ఇప్పుడు రక్తం పిండి వసూలు చేస్తున్నారు.నాడు మేము అధికారంలోకి వస్తే ఉచితంగా అన్నారు ఇప్పుడు ఏమైంది. గృహిణులు ఆలోచన చేయాలని కోరారు. నిరుద్యోగులకు 4000 వేలు ఇస్తాం అన్నారు. అసెంబ్లీలో ఆ ఊసే ఎత్తలేదు. ఓటు ఎదుకు వేయాలో ఆలోచన చేయాలన్నారు.
ఆటో అన్నలకు 12000 అన్నారు. ఏమైంది.ఆటో అన్నలు ఇవాళ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆటో డ్రైవర్లు ఆలోచించాలన్నారు. అప్పుల గురించి ఆనాడు రాద్ధాంతం చేసారని ఇవాళ 16 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని ?రోపించారు. ఇంకా అప్పుకోసం ఢిల్లీలో ప్రయ-ంత్నం చేస్తున్నారన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి ఆంక్షలు పెట్టినందుకు ఓటేయాలా అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం పని చేసే 3000 మందికి ఇప్పటివరకు జీతాలు రాలేదన్నారు. వృద్దులకు, వితంతులకు, వికలాంగులకు ఒక నెల పెన్షన్ ఎగకొట్టారని.. విద్యార్థులకు స్కాలర్ షిప్ లు లేవు.విదేశీ విద్యకు ఇప్పటివరకు పైసలు ఇవ్వడం లేదన్నారు. సీఎం ఆర్ ఎఫ్ దాదాపు 70 వేల మంది కి పెండింగ్ లొ పెట్టారని ఆరోపించారు. నాడు పోలవరం ప్రాజెక్టు వాల్ , డయాఫ్రాం వాల్ కొట్టుకుపోయింది ...ఇప్పటివరకు రిపోర్ట్ లేదు . ఎందుకు కాళేశ్వరం ప్రాజెక్టు ఎన్ డి ఎస్ ఏ వచ్చింది.ఆ రిపోర్ట్ 4 నెలల్లో వస్తుంది అంటున్నారు. అప్పటివరకు ఎందుకు సమయం పడుతుందని ప్రశ్నించారు. వచ్చే వానాకాలం లో నీళ్లు ఇవ్వరా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.
వర్ష కాలంలో ఫ్లడ్ వస్తే పంప్ హౌస్ మునిగిపోతే మేము ప్రభుత్వం కు భారం పడకుండా త్వరితగతిన పూర్తి చేసి నీళ్లు లిఫ్ట్ చేశామమన్నారు. తుమ్మిడి హెట్టి దగ్గర ఆల్రెడీ మహారాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ల్యాండ్ ఆక్వాకేషన్ చేసి ప్రాజెక్టు నిర్మాణం చేయవచ్చన్నారు. తుమ్మిడి హెట్టి పై ఆయనకు అవగాహన లేకుండా మాట్లాడారని.. అసెంబ్లీ కి ప్రతిపక్ష నేత ఎందుకు రాలేదు అంటే ఆయన ఆరోగ్యం బాగాలేదు. ఆ విషయం రేవంత్ కూడా తెలుసన్నారు. ఒక్క రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తిని,పట్టుకొని ఇలా మాట్లాడవచ్చా అని ప్రశ్నించారు. సచివాలయంలో విలేకరులకూ స్వేచ్ఛ లేదన్నారు.

# ఇయ్యాల్లో.. రేపో..!

**మొదటిపేజీ తరువాయి..**

రేవంత్ రెడ్డి.. షెడ్యూల్ కంటే ముందే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో పాలమూరు న్యాయ యాత్ర పేరుతో వంశీచంద్ రెడ్డి పర్యటన పూర్తి చేసుకున్నారు. ఈ యాత్ర ముగింపు సభకు ప్రజా దీవెన సభగా నామకరణం చేశారు.పాలమూరు ప్రజా దీవెన సభా వేదికగా జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి పలు వరాలు ప్రకటిస్తారని సమాచారం. విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తూ పలు విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రకటన చేసే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గ ఉపఎన్నిక అభ్యర్థిని కూడా ప్రకటిస్తారని చెబుతున్నారు.



# కరువును ఎదుర్కొందాం

**మొదటిపేజీ తరువాయి..**

వీడియో కాన్ఫరెన్స్ అనుసంధా నం చేసి నేరుగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వినూత్నంగా ఈ కార్యక్రమం చేపట్టింది. తొలి విడతగా ప్రయోగాత్మకంగా 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను నెలకొల్పింది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రూ.97 కోట్లతో ఈ కార్యక్రమం చేపట్టింది. దీంతో రాష్ట్ర అధికారులతో పాటు వ్యవసాయ నిపుణులు నేరుగా గ్రామాల్లో, పంట పొలాల్లో ఉండే రైతులతో ముఖాముఖి మాట్లాడి వాళ్ల సమస్యలను తెలుసుకుంటుంది. పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలతో పాటు అధునాతన మెలకువలను ఎప్పటికప్పుడు వారికి అందిస్తుంది. ఆదర్శ రైతులు తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకునేందుకు వీలు కల్పిస్తుంది. వీడియో కాన్ఫరెన్స్ లో చేపట్టిన ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రతి సీజన్లో రైతులు ఎదుర్కునే సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఎప్పటికప్పుడు వాళ్లకు సలహాలు సూచనలిచ్చేందుకు రైతు నేస్తం ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. నేరుగా రైతులు వ్యవసాయ నిపుణులతో మాట్లాడేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రభుత-్వమే ప్రజల దగ్గరికి వెళ్లాలని, అందులో భాగంగానే రైతుల సమస్యలను తెలుసుకోవాలనే ఆలోచనతో వ్యవసాయ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. రైతులతో కలిసి మెలిసి భవిష్యత్ కార్యక్రమాలను తమ ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. విత్తనాలు, ఎరువులు, ఏ పంట వేయాలనేది మొదలు పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకునేంత వరకు ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కాకుండా లాభసాటి ధర రావాలనే ఆలోచనతో ప్రభుత్వం కార్యాచరణ చేస్తోందన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతులకు విత్తనాలు అందుబాటులోకి తీసుకురావటం, ఐకేపీ సెంటర్లు, మార్కెట్ యార్డుల ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోలు కార్యక్రమాలన్నీ చేపడుతుందన్నారు.

# బలం.. బలగం..ఉన్నోళ్ల కోసం!

**మొదటిపేజీ తరువాయి..**




సహజమే. అయితే.. పార్టీ ఓటమితో పాత నేతలెవరూ ఇప్పుడు ఎంపీ సీటు మాకొద్దంటే మాకొద్దని దూరంగా ఉంటున్నారు. గతంలో కేసీఆర్‌తో రాసుకుపూసుకు తిరిగి, పోటీకి ఉవ్విళ్లూరిన కొందరు సంపన్నులు సైతం మొహం చాటేయటం ఆ పార్టీని కలవరపరుస్తోంది.రాష్ట్రంలో అధికారం పోయిన సిట్టింగ్ సీట్లను నిలుపుకునేందుకు తంటాలు పడాల్సి వస్తోంది. సిట్టింగ్‌లలో ముగ్గురు వేరే పార్టీలోకి వెళ్లిపోయారు. వీరిలో నాగర్ కర్నూల్ ఎంపీ రాములు.. కుమారుడు భరత్‌కు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కి బీజేపీ సీటు కూడా ఇచ్చేసింది. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి పోటీ చేయలేనని చెప్పారన్న ప్రచారం జరుగుతోంది. మహబూబ్ నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి పూర్తిగా సైలెంట్ అయ్యారు. ఆయన బంధువులు కాంగ్రెస్ లో చేరిపోయారు. సిట్టింగ్ ఎంపీలే కాదు.. ఎంపీ స్థానానికి పోటీ చేసే స్థాయి ఉన్న నేతలు కూడా పార్టీ వీడిపోతున్నారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ సీటులో బొంతు శ్రీదేవి కాంగ్రెస్ నుంచి నిలిచే అవకాశముందనే వార్తలూ వినిపిస్తున్నాయి. మరోవైపు చెవెళ్ల పార్లమెంటు బరిలో ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్ రెడ్డి నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. అధికారంలో ఉన్నంత కాలం కేసీఆర్ ను పొగుడుతూ రాజకీయం చేసిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ సొంత సీటులో మారిన రాజకీయాలతో కేసీఆర్ పేరే ఎత్తటం లేదు. తెలగాణలో ముస్లింల ఓటు బ్యాంక్ చాలా కీలకం. మజ్లిస్ సహకరిస్తే.. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ వంటి చోట్ల.. కాంగ్రెస్ పార్టీ .. డామినేట్ చేసే అవకాశం ఉంది. మజ్లిస్ పాలసీ ప్రకారం అధికార పార్టీకే అండగా ఉంటుంది. హైదరాబాద్ స్థానంలో మాత్రమే.. అసదుద్దీన్ నిలబడి.. మిగిలినచోట్ల కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండే అవకాశం ఉంది. ఇదిబీఆర్ఎస్ బలాన్ని మరింత తగ్గించడమే అవుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 సీట్లలో కాంగ్రెస్ 4, బీజేపీ 4 గెలుచుకోగా, బీఆర్ఎస్ బలం 2 సీట్లకు పడిపోయింది. ఈ రెండు నెలల్లో అక్కడి అనేక గ్రామ, మండల, స్థానిక సంస్థల సభ్యులు కాంగ్రెస్‌లో చేరిపోవటంతో అక్కడ అభ్యర్థిగా నిలిచేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. నిజామాబాద్ సీటులో గతంలో పోటీ చేసిన కుమార్తె కవిత సైతం పోటీకి సిద్ధపడటం లేదు. మరెవరూ ఆ సీటు అడగడం లేదు. బండి సంజయ్ సిట్టింగ్‌గా ఉన్న కరీంనగర్ సీటు పరిధిలోని 7 అసెంబ్లీ సీట్లలో 4 కాంగ్రెస్, 3 బీఆర్ఎస్ గెలిచాయి. బిఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్‌కే చాన్సిచ్చారు. మెదక్ ఎంపీ సీటు పరిధిలోని 7 స్థానాల్లో కేవలం మెదక్ సీటు తప్ప అన్నీ బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎలాంటి పరిస్థితిలోనూ బీఆర్ఎస్ గెలుస్తుందని అనుకుంటున్నా.. అభ్యర్థి విషయంలో మాత్రం పీట ముడిపడిపోయింది. జహీరాబాద్ ఎంపీ పరిధిలోని సెగ్మెంట్లలో 4 కాంగ్రెస్ చేతిలో, ఒకటి బీజేపీకి దక్కగా బీఆర్ఎస్ బాన్సవాడ, జహీరాబాద్ సీట్లకే పరిమితమైంది. దీంతో అక్కడా సీటు తీసుకునేందుకు ఎవరూ సాహసించటం లేదు. సిట్టింగ్ ఎంపీ బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు.నల్గొండ, భువనగిరి, ఖమ్మం సీట్ల కోసం ఒక్క దరఖాస్తు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఉమ్మడి ఖమ్మం, నల్గొ?ండ జిల్లాల్లో గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలో గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కాంగ్రెస్ బాట పట్టటంతో అక్కడ నామా నాగేశ్వరరావుకే టిక్కెట్ ఖరారు చేశారు. కానీ ఆయన బీజేపీ తరపున పోటీ చేస్తారన్న ప్రచారం ఊపందుకుంటోంది. మహబూబ్ నగర్ సీటు, వరంగల్లు, మహబూబాబాద్‌లోనూ అదే పరిస్థితి. సికింద్రాబాద్ సీటు నుంచి తలసాని సాయిని బరిలో దించాలని పార్టీ భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లో సత్తా చాటలేకపోతే.. మరో 5 ఏళ్ల నాటికి పార్టీ నామరూపాల్లేకుండా పోయేలా ఉందనేది ఎక్కువ మంది భావన. ఈ పరిస్థితి నుంచి కేసీఆర్ గట్టెక్కాల్సి ఉంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆందోళన

**వికారాబాద్ - ప్రభాతసూర్యుడు :**
వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఎల్ఆర్ఎస్ పేరుతో ప్రజల నుంచి వేల కోట్ల రూపాయలను దోచుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఎలాంటి చార్జీలు లేకుండా ప్లాట్ల క్రమభద్దీకరణ చేయాలని డిమాండ్ చేస్తు వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అదికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు ఎల్ ఆర్ ఎస్ ను పేరుతో డబ్బులు వసూలు చేసన్నరని కోర్టలో కేసులు కూడా వేశారు మరి ఇప్పుడు మి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాబట్టి ఇప్పుడైనా ఎల్ ఆర్ ఎస్ ను రద్దు చేయలని వికారాబాద్ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.



# మరో ఎమ్మెల్యే రెడీ...

**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :**
పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో రాజకీయాలు వేగంగా మారిపోతున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డితో వరుస భేటీలు అవుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య భేటీ అయ్యారు. సచివాలయంలో రేవంత్‌ను యాదయ్య కలిశారు. లోక్‌సభ ఎన్నికలకు ఈ వారంలో ఈసీ షెడ్యూల్ విడుదల చేయనుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో రేవంత్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే యాదవ్ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో త్వరలో యాదవ్ పార్టీ మారుతారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేవంత్‌ను కలవగా.. ఇప్పుడు మరో ఎమ్మెల్యే కలవడం గులాబీ వర్గాలను టెన్షన్ పెట్టిస్తుంది.
కాలె యాదయ్య చేవెళ్ల నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018 ముందస్తు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు.



ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ నుంచి కేవలం 268 ఓట్ల స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేయడంతో ఆ పార్టీ నేతలతో ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కూడా ఉండటంతో తిరిగి హస్తం గూటికి చేరాలని యాదయ్య భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే రేవంత్‌ను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్దంగా ఉన్నట్లు రేవంత్‌తో యాదయ్య చెప్పినట్లు టాక్ నడుస్తోంది. అన్నీ అనుకూలిస్తే త్వరలో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల సమక్షంలో యాదయ్య కండువా కప్పుకునే అవకాశాముందని వార్తలొస్తున్నాయి.

# కాపు కాసి..



- కరీంనగర్‌లో కాంగ్రెస్ ఆచితూచి అడుగులు
- 'బండి' ఢీకొట్టే నేత కోసం వెతుకులాట
- 'కాపు' వర్గపు నేతను బరిలో దించే యోచన

**కరీంనగర్, ప్రభాతసూర్యుడు :**
లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల జోష్‌ను లోక్‌సభ ఎన్నికల్లో కొనసాగించాలని కాంగ్రెస్ భావిస్తోంది. మరో జాతీయ పార్టీ బీజేపీ సిట్టింగ్ స్థానాలను డబుల్ చేసుకోవాలని చూస్తోంది. ఇక పదేళ్లు అధికారంలో ఉండి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలను నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. బీజేపీ 9 మందిని ప్రకటించగా, బీఆర్ఎస్ 4 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. కాంగ్రెస్ ఇంకా కసరత్తు చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ సీటుపై అందరి దృష్టి పడింది. ఇక్కడి నుంచి ప్రస్తుతం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీగా ఉన్నారు. 2019 ఎన్నికల్లో బలమైన బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ఓడించి చరిత్ర సృష్టించారు. వెలమ నేతను ఓడించిన బీసీగా గుర్తింపు తెచ్చుకున్నారు. నాడు కేసీఆర్ చేసిన హిందుగాడు, బొందుగాడు వ్యాఖ్యలు బండి సంజయ్ విజయంలో కీలకంగా మారాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ మూడోస్థానానికి పరిమితమయ్యాడు. ఈ ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కరీంనగర్ నుంచి బీజేపీ తరఫున సిట్టింగ్ ఎంపీ సంజయ్, బీఆర్ఎస్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్ పోటీ చేయడం ఖాయమైంది. ఈమేరకు రెండు పార్టీలు టిక్కెట్లు ప్రకటించాయి. ఇక ఈ ఇద్దరినీ ఢీకొట్టి గెలిచే నేత కోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇక్కడి నుంచి వెలిచాల రాజేందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఈ ముగ్గురికీ బలమైన బండి సంజయ్‌ను ఢీకొట్టే సత్తా లేదు. దీంతో బలమైన అభ్యర్థి కోసం వేట సాగిస్తోంది. కరీంనగర్‌లో కాపు ఓటర్లు ఎక్కువ. ఈ సామాజికవర్గం ఓట్లు 3 లక్షల వరకు ఉంటాయని అంచనా. దీంతో కాంగ్రెస్ కాపు అస్త్రం ప్రయోగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌ను బరిలో దించాలని భావిస్తోంది. బండి సంజయ్ మున్నూరు కాపు నేత. తీన్మార్ మల్లన్న కూడా కాపు సామాజికవర్గం నేత. దీంతో కాపుల ఓట్లు చీలుతాయని, మైనారిటీ ఓట్లు కాంగ్రెస్‌కే వస్తాయని హస్తం నేతలు భావిస్తున్నారు. తీన్మార్ మల్లన్నకు కరీంనగర్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. క్యూన్యూస్ ద్వారా ఆయన కరీంనగర్ ప్రజలకు దగ్గరయ్యాడు. ఇవి కూడా ఆయన ప్లస్ పాయింట్‌గా కాంగ్రెస్ బావిస్తోంది. తీన్మార్ మల్లన్న ప్రముఖ తెలుగు జర్నలిస్ట్. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేత పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014 ఎన్నికల ఫలితాలకు ముందు తీన్మార్ మల్లన్న కేసీఆర్‌ను ఆయన ఫామ్‌హౌస్‌లో కలిసేందుకు అంగీకరించారు. అయితే తీన్మార్ మల్లన్నను పార్టీతో కలిసి పనిచేయాలని కేసీఆర్ కోరినప్పటికీ ఆయన ఆశించిన ఘనస్వాగతం లభించలేదు. దీంతో కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాడు. 2019లో హుజూర్‌నగర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఓడిపోయారు. 2019 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పోటీ చేసి ఓడిపోయారు. 2021లో బీజేపీలో చేరారు. కానీ కొన్ని రోజులే కొనసాగారు. 2023 అసెంబ్లీ ఎన్నికల వేళ తీన్మార్ మల్లన్న కాంగ్రెస్‌లో చేరారు. తన క్యూన్యూస్‌లో కాంగ్రెస్ అనుకూలంగా ప్రచారం చేశారు.

# ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా చేయాలి

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ ను ఉచితంగా చేయాలని, లేదంటే న్యాయ పోరాటం చేస్తామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు బుధవారం అమీర్ పేట లోని మైత్రివనం వద్ద నిర్వహించిన ధర్నా లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద కుటుంబాలను ఇబ్బందులు పెట్టొద్దనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో ఎల్ఆర్ఎస్ జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని మరిచి ఒఖీా పేరుతో 25 లక్షల కుటుంబాలపై ఆర్థికభారం మోపి 20 వేల కోట్ల రూపాయల వరకు దోపిడీ చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ధ్వజమెత్తారు. నాడు



ఎల్ఆర్ఎస్ పై మాట్లాడిన నేటి మంత్రులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని, అప్పటి వరకు మా ప్రభుత్వం పై ఆందోళన కొనసాగుతుందని ఆయన హెచ్చరించారు. ధర్నా అనంతరం హెచ్ఎండీయే కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, ఆకుల రూప, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇప్పటికి నలుగురే..

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :**
పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. కరీంనగర్ అభ్యర్థిగా బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్ పేర్లను ఇదివరకే కేసీఆర్ ప్రకటించారు. తాజాగా మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి మాలోత్ కవిత, ఖమ్మం నియోజకవర్గం నుంచి నామా నాగేశ్వరరావు పోటీ చేస్తారని కేసీఆర్ ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పొందిన నేపథ్యంలో కీలక నాయకులు భారత రాష్ట్ర సమితికి గుడ్ బై చెబుతున్నారు. జహీరాబాద్ ఎంపీ పాటిల్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, నాగర్ కర్నూల్ ఎంపీ రాములు భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి వచ్చారు. వీరిలో వెంకటేష్ నేత కాంగ్రెస్ పార్టీలో చేరగా.. పాటిల్, రాములు కాషాయ కండువా కప్పుకున్నారు. బిజెపి ఇప్పటికే 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో.. శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు కేసిఆర్ నలుగురు అభ్యర్థులను ప్రకటించారు. తెలంగాణ భవన్లో కార్యకర్తలతో, ముఖ్య నాయకులతో కెసిఆర్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ మధ్య ఉంటుందని కెసిఆర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఏదో అదృష్టం కొద్దీ మొన్నటి ఎన్నికల్లో గెలిచిందని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పరిస్థితి ఉండదని కెసిఆర్ ప్రకటించారు. పార్లమెంటు ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి అభ్యర్థులు సత్తా చూపిస్తారని ఆయన వివరించారు.. ఆదివారం నిర్వహించిన సమావేశంలో పెద్దపల్లి, కరీంనగర్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్.. సోమవారం మరో ఇద్దరు అభ్యర్థుల పేర్లను వెల్లడించారు. అయితే భారత రాష్ట్ర సమితి నుంచి పోటీ




బిజెపి ఇప్పటికే 9 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో.. శ్రేణుల్లో ధైర్యం నింపేందుకు కేసిఆర్ నలుగురు అభ్యర్థులను ప్రకటించారు.

చేయడానికి చాలామంది అభ్యర్థులు వెనుకంజ వేసన్నట్టు తెలుస్తోంది. అందుకే కెసిఆర్ ఒకేసారి అభ్యర్థుల పేర్లను ప్రకటించడం లేదని సమాచారం. ఇక సోమవారం ప్రకటించిన మహబూబాబాద్ పార్లమెంటు స్థానానికి సంబంధించి మాలోత్ కవిత పోటీ చేయరని అందరూ అనుకున్నారు. ఈ స్థానం నుంచి ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తనయుడు, ఐఆర్ఎస్ అధికారి జీవన్‌లాల్ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. టికెట్ కూడా ఆయనకే ఇస్తారని భారత రాష్ట్ర సమితిలో ఒక వర్గం నాయకులు అనుకున్నారు. ఇటీవల మహబూబాబాద్ నియోజకవర్గంలో జీవన్ లాల్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్లమెంట్ స్థానానికి తాను బరిలో ఉన్నట్టు సంకేతాలు ఇచ్చారు. కానీ తీరా అభ్యర్థిని ప్రకటించే విషయంలో కెసిఆర్ కవిత వైపు మొగ్గు చూపారు. కెసిఆర్ నిర్ణయంతో జీవన్ లాల్ వర్గం డీలా పడినట్టు తెలుస్తోంది.



# నారాయణఖేడ్‌లో అగ్ని ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..**
గల కారణాలు తెలియాల్సి ఉంది. భారీగా ఆస్తి నష్టం సంభవించిందని.. ఇంకా ఎంత నష్టం జరిగిందనేది అంచనాకు రాలేదని షెడ్డు యజమాని తెలిపారు. పోలీసులు ఈ ఘటనపై విచారణ చేసన్నారుఅటు, హైదరాబాద్ లోని సైఫాబాద్ రోడ్డు వద్ద బుధవారం మధ్యాహ్నం నడుస్తున్న కారులో మంటలు చెలరేగాయి. కారు లక్డీకాపూల్ నుంచి ఖైరతాబాద్ వైపు వెళ్తుండగా అందులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కారును రోడ్డు పక్కన ఆపేశాడు. కారులోని వారంతా కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతరం నిమిషాల వ్యవధిలోనే కారు దగ్ధమైంది. దట్టమైన పొగలతో అగ్ని కీలలు ఎగిసిపడగా.. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో సమీపంలోని హెచ్ పీ పెట్రోల్ పంపును మూసేశారు. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# ఎన్ని ఇబ్బందులైనా నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తాం

**మొదటిపేజీ తరువాయి..**
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ఫ్యాక్టరీ పునఃప్రారంభం చేస్తామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టామని మంత్రి శ్రీధర్ బాబు గుర్తు చేశారు. మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాడనికి ప్రభుత్వం ఒక కమిటీని వేసిందని, ఆ కమిటి చెరుకు రైతులు, అధికారులతో చర్చలు జరిపిందని చెప్పారు. అంతేకాకుండా ఇంతవరకు



నిజాం షుగర్ ఫ్యాక్టరీని నడిపిన యాజమాన్యంతో సమస్యను అధిగమించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించి ముందడుగు వేశామని స్పష్టం చేశారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం చెరుకు రైతులను, అధికారులను లెక్కచేయకుండా నష్టపర్చిందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల చెరుకు రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం ఒంట్టేద్దు పోకడతో చెరుకు రైతుల జీవితాల్లో చీకటి నింపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యాక్టరీని తెరిపించి చెరుకు రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించడంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని దీన్ని విలువ ఆధారిత పరిశ్రమగా ముందుకు తీసుకెళ్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రజలు ఎన్నికల్లో మార్పు కోరారని దానికనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాలనలో తప్పకుండా మార్పు చూపిస్తామని శ్రీధర్ బాబు తెలిపారు.

# నడుస్తున్న కారులో మంటలు

**మొదటిపేజీ తరువాయి..**
ఉన్న వారంతా వెంటనే దిగిపోయారు. ఆ తర్వాత నిమిషాల వ్యవధిలోనే కారులో మంటలు చెలరేగాయి. దట్టమైన పొగలతో పాటు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. దీంతో లక్డీకపూర్ పరిసంప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపును మూసివేశారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి అగ్నిమాపక యంత్రాలను తీసుకొచ్చి పోలీసులు మంటలను అదుపు చేశారు. అనంతరం కాసేపటికే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. పాత కారు కావడంతో కారులో షార్ట్ సర్క్యూట్ అయ్యి, మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నంద్యాలలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..**
ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ మండలం నల్లగుంట్ల దగ్గర హైవేపై ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీ కొట్టింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న వారంతా తిరుపతి శ్రీవారి దర్శనానికి వెళ్లి వస్తున్నారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి నిద్రమత్తు కారణమై ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా మృతి చెందారు. సికింద్రాబాద్లోని వెస్ట్ వెంకటాపురం ప్రాంతానికి చెందిన మంత్రి రవీందర్ తన కుటుంబంతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. కారులో రవీందర్ తోపాటు అతడి భార్య లక్ష్మీ, కుమారుడు బాల కిరణ్, కోడలు కావ్య, మరో కుమారుడు ఉదయ్ కిరణ్ ఉన్నారు. వీరిలోనే ఒకరు కార్ డ్రైవ్ చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. తెల్లవారుజాము కావడంతో నిద్ర మత్తులోకి జారుకోవడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని



పోలీసులు భావిస్తున్నారు. గత నెల 29న బాలకిరణకు కావ్య తో గుంటూరు జిల్లా తెనాలిలో వివాహం జరిపించారు. ఈ నెల మూడో తేదీన శామీర్పేటలో ఘనంగా రిసెప్షన్ కూడా పూర్తి చేశారు. నాలుగో తేదీన నూతన దంపతులతో కలిసి వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమలకు వెళ్లారు. తిరిగి ప్రయాణం అవుతున్న క్రమంలోనే ఈ ప్రమాదం సంభవించింది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# మమ్మల్ని విమర్శించే అర్హత బిజెపికి లేదు

**మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** ఎన్డీఎస్యే బృందం నాలుగు రోజుల పాటు తెలంగాణలో పర్యటించనున్నారు. ఎన్డీఎస్ఎ నాలుగు నెలల్లో రిపోర్టు సమర్పిసా-మని తెలిపిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అంతకన్నా ముందే ప్రాథమిక రిపోర్ట్ వీలైనంత తొందరలో ఇవ్వాలని కోరాం. దాని ఆధారంగా వెంటనే డ్యాం రిపేర్ తో పాటు తప్పు చేసిన వారిపై చర్యలు చేపడుతాం. కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్ఎస్ కు ఏటీఎం గా మారటానికి ప్రధాన కారణమే మోదీ ప్రభుత్వం. కార్పొరేషన్ల ద్వారా 84 వేల కోట్ల రుణం అందించింది కేంద్ర సహకారం తో తీసుకుంది. మమ్మల్ని విమర్శించే అర్హత బిజెపికి లేదని అన్నారు.



## సంపాదకీయమ్..

# ఇక తెలుగు నేతలు కనిపించరా...

జాతీయ రాజకీయాలు ఈ మాట అనగానే దేశం మొత్తం కళ్లకు కదుతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఉన్న ఆసేతు హిమాచలం గురించి నాయకులు చర్చించే అవకాశం జాతీయ రాజకీయాల్లో సస్పష్టం. ఒకప్పుడు అనేక మంది తెలుగు వారు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సహా.. మద్రాసు రాష్ట్రం నుంచి కూడా అనేక మంది నాయకులు జాతీయస్థాయిలో ఓ వెలుగు వెలిగారు. అయితే.. గడిచిన పదేళ్ల కాలంలో జాతీయ రాజకీయాల్లో వన్నెలీనుతున్న తెలుగు వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా ఈ ఐదేళ్ల కాలంలో వేళ్ల మీద లెక్కించుకునే స్థాయిలో నాయకుల సంఖ్య పడిపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిప్రస్తావించారు. జాతీయ రాజకీయాల్లో తెలుగు నేతల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టడం ప్రమాదకర సంకేతాలకు నిదర్శనమని ఆయన పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి గడిచిన పదేళ్ల కిందటి వరకు కూడా తెలుగు ప్రాంతానికి చెందిన అనేక మంది నాయకులు జాతీయస్థాయిలో కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పీవీ నరసింహారావుప్రధానమంత్రిగా ఈ దేశాన్ని పాలించారు. ఆయన తర్వాత.. మళ్లీ ఈ స్థాయిలో ప్రధాని పీఠాన్ని ఎక్కగలిగిన నాయకుడు కనుచూపు మేరలో కనిపించకపోవడం గమనార్హం. ఇక, కేంద్ర మంత్రులుగా పదుల సంఖ్యలో నాయకులు పని చేశారు. అయితే.. ఇప్పటిలా కాకుండా అప్పట్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న నాయకులుగా జాతీయ పార్టీలు వారిని గౌరవించాయి. ఈ క్రమంలోనే మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు సంజీవరెడ్డి, జైపాల్‌రెడ్డి, పళ్లం రాజు, జేడీ శీలం వంటి నాయకులు గడిచిన 15 ఏళ్ల కాలంలో దేశానికి తెలుగువారిగా సేవలు అందించారు. వీరికి ఏరికోరిపదువులు దక్కడం గమనార్హం. నిజానికి ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి తెలుగు వారికి దక్కింది. ఆ తర్వాత.. చంద్రబాబు నాయుడు హయాంలోనూ ఎన్డీయే కూటమికి సారథ్యం వహించే బాధ్యతలు కూడా వచ్చాయి. ఇక, రాష్ట్రపతి ఎంపిక నుంచి కొన్నికొన్ని మౌలిక నిర్ణయాల్లోనూ తెలుగు వారి పాత్ర ఒకప్పుడు ఉండేది. తెలుగు వారికి పదవులు దక్కేందుకు ఏ పార్టీ కూడా.. ప్రాధాన్యం తప్పనిసరిగా ఇచ్చిందే కానీ.. ఏదో సంఖ్యా పరమైన మద్దతు కోసం ఇవ్వాలని ఇవ్వలేదు. అంటే.. వారిలో ఉన్న సత్తా, ప్రజాభిమానం, జాతీయస్థాయి నాయకత్వ లక్షణాలు వంటివి ద్విగుణీకృతమయ్యాయి. ఇక, 2014 ఎన్నికల తర్వాత.. బీజేపీతో పొత్తులో ఉన్న కారణంగా రెండు కేంద్ర మంత్రి పదవులు తెలుగు వారికి అందునా తెలుగు దేశం పార్టీ నాయకులకు దక్కాయి. అయితే, వీరి ప్రధాన భూమిక జాతీయ స్థాయిలో ఇనుమడించలేక పోవడం గమనార్హం. కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ.. రాష్ట్రస్థాయిలోనే వారు తమను తాము పరిమితం చేసుకున్నారు. కానీ, ఒక పీవీలాగా, సంజీవ రెడ్డి మాదిరిగా, వెంకయ్య నాయుడు తరహాలో బలమైన ముద్రను సంతరించుకోలేక పోయారు. ఇక, ఇప్పుడు కనీసం జాతీయ స్థాయిలో రాణించదగ్గ నాయకులు కనిపించడమే లేదు. ఒకరిద్దరు ఉన్నప్పటికీ.. వారు కూడా.. నామమాత్రపు పాత్రలతో పరిమిత రాజకీయాలకే కట్టుబడి పోయారు. ఉదాహరణకు తెలంగాణకు చెందిన గంగాపురం కిషన్‌రెడ్డి ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో కేంద్రమంత్రిగా ఉన్నారు. కానీ, ఆయన పరిధి చాలా స్వల్పంగా మారిపోయింది. సలహాలు ఇచ్చేందుకు, సూచనలు చేసేందుకు, విధాన పరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకునేందుకు అవకాశమే లేకుండా పోవడం ఆలోచించాల్సిన విషయం. కేంద్రంలో 2014 నుంచి ఇప్పటి వరకు అధికారంలో ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలుగు వారి ప్రాధాన్యాన్ని నానాటికీ తీసికట్టుగా మార్చేసింది. 2019 వరకు కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్య నాయుడును ఉపరాష్ట్రపతిని చేసిన దరిమిలా తెలుగు వారి గళం జాతీయ స్థాయిలో వినిపించడం తగ్గిపోయింది. ఇక, ఆ తర్వాత.. మరింతగా తెలుగు వారి ప్రాభవం తగ్గిపోయిందనే చెప్పాలి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 22 మంది ఎంపీలు ఉన్నా.. వారిలోనూ ఏ ఒక్కరూ బలమైన జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగలేకపోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ఉత్తరాది రాజకీయాల డామినేష-నేనని అంటారు పరిశీలకులు. జాతీయ స్థాయిలో బలమైన నాయకులు లేకపోతే ఏం జరుగుతుంది? అనేది కీలక ప్రశ్న. తెలుగు వారి గళం బలంగా వినిపించే అవకాశం లేకపోవడం ప్రధాన లోపంగా మారుతుంది. అంతేకాదు..తెలుగు రాష్ట్రాల సమస్యల పరిష్కారానికి కూడా దిక్కులు చూడాల్సిన పరిస్థితి, విధాన పరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకునే వెసులు బాటు లేకపోవడం వంటి కీలకమైన అంశాల విషయాల్లో తెలుగు వారిపాత్ర మరింత తగ్గిపోతుంది. నిజానికి ఎంపీలుగా ఉన్న వారికి జాతీయ స్థాయిలో బలమైన గళం వినిపించడంతోపాటు.. జాతీయ రాజకీయాలపై పట్టు పెంచుకునే అవకాశం ఉంది. అయితే.. ప్రాంతీయ పార్టీల ఆధిపత్యాన్ని అడ్డుకునే రీతిలో జాతీయ పార్టీల వ్యవహార శైలి ఉండడం దీనికి ప్రధాన అవరోధంగా మారింది. దీనిని అధిగమించి.. జాతీయ స్థాయిలో నాయకులు వెలుగొందిననాడే.. తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయనడంలో సందేహం లేదు. ఉదాహరణకు.. కేంద్రంలోఒకప్పుడు చక్రం తిప్పిన వెంకయ్యానాయుడు ఏపీ సహా తెలంగాణ సమస్యలపై ఎవరు వెళ్లినా..చెప్పుకొనేందుకు సమయం ఇచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశారు. ఫలితంగా రెండు తెలుగు రాష్ట్రాలకు అంతో ఇంతో మేలు జరిగింది. ఇలాంటి వ్యూహాత్మకమైన నాయకుల అవసరం ఎంతో ఉంది.

# గద్వాల జేజేమ్మకేనా...

**మహబూబ్‌నగర్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలో 9 పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ .కీలకమైన మహబూబ్ నగర్ ఎంపీ సీటును పెండింగ్ లో పెట్టడానికి కారణాలు ఏంటి ? మాజీ మంత్రి డీకే అరుణ కు సీటు గ్యారెంటీ అనుకుంటున్న తరుణంలో...ఆమె పేరు ఎందుకు ప్రకటించలేదు. మహబూబ్ నగర్ పార్లమెంట్ సీటు కోసం ఇద్దరు పోటీ పడటమే కారణమా ? లేదంటే ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అన్న చర్చ తెలంగాణలో జరుగుతోంది. బీజేపీ తరపున ఎంపీ సీటును ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణతో పాటు మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పోటీ పడుతున్నారు. జితేందర్ రెడ్డి ఒకసారి బీజేపీ తరపున, మరోసారి బీఆర్ఎస్ తరపున లోక్ సభకు ఎన్నికయ్యారు. అందుకే ఇపుడు ఆయన అదే పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ కారణంగానే డీకే అరుణ పేరు బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో లేదని తెలుస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చెరగని ముద్ర వేసింది డీకే అరుణ ఫ్యామిలీ. గత లోక్‌సభ ఎన్నికల ముందు బిజెపిలో చేరిన ఆమె...మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి స్వల్ప మెజారిటితో ఓడిపోయారు. ఈ సారి అదే నియోజవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్న గద్వాల జేజమ్మ...మహబూబ్‌నగర్ పార్లమెంట్ లో తన పవర్ ఏంటో చూపించాలని నిర్ణయించుకున్నారు. పార్టీ హైకమాండ్‌తో ఆమెకున్న సంబంధాలు, నమ్మకం,పార్టీలో ఉన్న ఇమేజ్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న పట్టు ఉండటంతో తొలి జాబితాలోనే పేరు వస్తుందని లెక్కలు వేసుకున్నారు. బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఆమె...తొలి జాబితాలోనే టికెట్ కన్ఫామ్ అవుతుందని అనుకున్నారు. పార్టీ అధిష్ఠానం మాత్రం 9 మంది అభ్యర్థిత్వాలను మాత్రమే ఖరారు చేసింది. ఈ పరిణామాన్ని డీకే అరుణనే కాదు...ఆమె అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఫస్ట్ లిస్ట్‌లో డీకే అరుణ పేరు లేకపోవడానికి...ఇదే నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పోటీ పడడమే కారణమని తెలుస్తోంది. డీకే అరుణకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సీటు ప్రకటించాలంటే...ముందుగా అదే సీటును ఆశిస్తున్న మాజీ ఎంపీ జితేందర్ రెడ్డిని ఒప్పించాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. జితేందర్ రెడ్డికి ఏదో ఒకరకంగా నచ్చజెప్పి...గద్వాల జేజమ్మను బరిలో నిలబెట్టాలని కాషాయ పార్టీ నేలు వ్యూహాలు రచిస్తున్నారు. జితేందర్‌రెడ్డి కూడా తనకు టికెట్ కావాలని పట్టుపడుతున్నప్పటికీ...ఈ సారికి నో అని హైకమాండ్ భావనగా ఉన్నట్లు సమాచారం. గత పార్లమెంట్ ఎన్నికల కంటే ముందు కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన డికే అరుణ...మహబూబ్ నగర్ పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి పోటి చేసి గట్టి పోటి ఇచ్చారు. 3,33,573 ఓట్లు రాబట్టుకున్న ఆమె...అప్పటి అధికార బిఆర్ఎస్ అభ్యర్థికి ముచ్చెమటలు పట్టించారు.మరోసారి టికెట్ దక్కించుకొని విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. ఎంపీగా గెలిస్తే...కేంద్ర కేబినెట్‌లో బెర్త్ కోసం ప్రయత్నం చేయవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే డికే అరుణ తన సొంత నియోజక వర్గ-మైన గద్వాలలో...అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవకుండా బిసి అభ్యర్థికి టికెట్ ఇప్పించారని ప్రచారం జరుగుతోంది.



# ఇందిరమ్మ ఇళ్లకు నిధులు



**హైదరాబాద్, ప్రభాతసూర్యుడు :** తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టిసారించింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షల రూపా-యల వరకు ఉచిత వైద్యం, రూ.500 లకు గ్యాస్, 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ లాంటి పథకాలను ప్రారంభించింది. తాజాగా.. తెలంగాణ పథకం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై దృష్టిసారించింది. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఈ నెల 11న ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా నిధులను కూడా కేటాయించింది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధింది హడ్కో మంగళవారం రూ.3 వేల కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 95,235 ఇళ్లు మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణం కోసం హౌజింగ్ బోర్డు రుణాన్ని వినియోగించనుంది. అంతకుముందు హౌజింగ్ బోర్డుకు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లు నిర్మించనున్నారు.ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మార్చి 11న ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ మొదట ప్రాధాన్యమివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నారు. అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని.. ప్రజా పాలనలో నమోదు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ప్రాధాన్యమివ్వాలని సూచించారు.అసలైన లబ్ధిదారులకు ఇళ్లు అందేలా పారదర్శకంగా పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. కాగా.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలం ఉన్నవారికి అదే స్థలంలో కొత్త ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు అందిస్తారు. వీటిని దశల వారీగా నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు.




# గ్రూప్-1, 2, 3 పరీక్షల తేదీలు ఖరారు

**హైదరాబాద్ - ప్రభాతసూర్యుడు :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక ప్రకటన చేసింది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలకు సంబంధించిన తేదీలను టీఎస్‌పీఎస్సీ ఖరారు చేసింది. గ్రూప్ -2 రాతపరీక్షలను ఆగస్టు 7, 8 తేదీల్లో, నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది.జూన్ 9వ తేదీన గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించనున్నట్లు ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. గ్రూప్-1 కింద 563, గ్రూప్-2లో 783, గ్రూప్-3 కింద 1388 పోస్టులను భర్తీ చేయనున్నారు.

# చైతన్యపురిలో వివాహిత ఆత్మహత్యయత్నం

**ఆలస్యంగా బయటపడ్డ వైనం**

**హైదరాబాద్- ప్రభాతసూర్యుడు :** చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో భర్త, అత్త మామాల వేధింపులు భరించలేక ఊహ (23) అనే వివాహిత నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్య యత్నం చేసింది. విషయం తెలుసుకున్న యువతి బంధువులు యువతిని చికిత్స నిమిత్తం మలక్ పేట లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం హాస్పిటల్ వద్దకు వచ్చిన భర్త స్నేహితులను యువతి తల్లిదండ్రులు ప్రశ్నించగా ...యువతి కుటుంబ సభ్యులను ,బంధువులపై దాడిచేసి చితకబాదిన భర్త స్నేహితులు. సిసి కెమెరాలో దాడి దృశ్యాలు రికార్డయ్యాయి. సూర్యాపేట జిల్లా కు చెందిన బుర్ర తిరువ-ంలేష్(27) బంధువులమ్మాయి అయిన ఊహా ను నాలుగు సంవత్సరాలు క్రితం ప్రేమ పేరుతో మో-సగించి, గర్భవతిని చేసి అబార్షన్ చేయించగా పెద్దల సమక్షంలో మాట్లాడి వివాహం చేయించారు. ఈ వివాహం మొదటి నుంచి ఇష్టంలేని అబ్బాయి తల్లిదండ్రులు అన్నదమ్ములు తరచు తమ భార్య భర్తల మధ్య తగాదాలు సృష్టించి,వరకట్న వేధింపులు చేస్తూ హింసించడం జరిగిందని బాధిత యువతి, యువతి కుటుంబ సభ్యులు మీడియా ముఖంగా ఆరోపించారు. మలక్ పేట పోలీసు స్టేషన్ లో దాడి ఘటన పై ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోకుండా ఇరు వర్గాలపై కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. తన భర్త తనకు ఫోన్ చేసి మీ కుటుంబ సభ్యులను,నిన్ను ,బాబు ను అందరిని అంతం చేస్తానని బెదిరించడని బాధితురాలు వాపోయింది. తనకు తన కుమారుడికి న్యాయం చేయాలని యువతి కోరారు. చైతన్య పురి పోలీసు స్టేషన్ లో యువతి పిర్యాదు చేసినట్లు తెలిపారు.



# ఏప్రిల్ 8న సూర్యగ్రహణం..


- **ఇది పగటిపూట రాత్రి లాంటి పరిస్థితిని సృష్టిస్తుంది**
- **2044 వరకు యునైటెడ్ స్టేట్స్‌లో కనిపించే చివరి సంపూర్ణ సూర్యగ్రహణం**

**న్యూఢిల్లీ - ప్రభాతసూర్యుడు :** 2024లో సూర్యగ్రహణం ఏర్పడనుంది. ఆకాశంలో అరుదైన ఖగోళ సంఘటనను ప్రపంచం చూస్తుంది. సూర్యుడిని పూర్తిగా కప్పి ఉంచే గ్రహణం చాలా అరుదుగా ఉంటుంది. ఇది పగటిపూట రాత్రి లాంటి పరిస్థితిని సృష్టిస్తుంది. సంపూర్ణ సూర్యగ్రహణం ఏప్రిల్ 8, 2024న సంభవిస్తుంది. సూర్యకాంతి పూర్తి ప్రకాశంతో తిరిగి రావడానికి ముందు వీక్షకులు తమ ప్రత్యేక సోలార్ గ్లాసెస్‌ని తీసివేసి క్షణకాలం పాటు తెరి చిన కళ్లతోచూడగలిగే ఏకైక గ్రహణం ఇది. చంద్రుడు సూర్యుడిని పూర్తిగా నిరోధించే సంక్షిప్త వ్యవధిలో, సంపూర్ణత అని పిలువబడే సమ యంలో మాత్రమే గ్రహణ అద్దాలను తీసివేయడం సురక్షితం అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.2044 వరకు యునైటెడ్ స్టేట్స్‌లో కనిపించే చివరి సంపూర్ణ సూర్యగ్రహణం అవుతుంది.



# నల్లగొండలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

**నల్లగొండ, ప్రభాతసూర్యుడు :** నల్గొండలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు నిర్వహించారు. సాయిరామ్ ఫార్మా అండ్ సర్జికల్లో తనిఖీ చేసి మినోక్సిటాప్ 10%’ అనే డ్రగ్ సీజ్ చేసారు. కొత్త వెంట్రుకలు పెరగడానికి ఈ మందును అమ్ముతున్నారు, వినియోగదారులను తప్పుదారి పట్టించినందుకు స్వాధీనం చేసుకున్నారు. హీలింగ్ ఫార్మా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన మినాక్సీటాప్ 10% గా గుర్తించారు. ఈ మెడిసిన్ ను వెంట్రుకలు తిరిగి పెరగడానికి ఉపయోగపడుతుంది, ఇది తిరిగి పెరగడాన్ని ప్రేరేపించడానికి వెంట్రుకల కుదుళ్లను తిరిగి సక్రియం చేస్తుందని ప్రచారం చేస్తూ మెడిసిన్ అమ్ముతున్నారు. డిసిఏ అధికారులు దాడుల్లో మినాక్సీ టాప్ నిల్వలు స్వాధీనం చేసుకున్నారు.



Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215